క్లుప్తంగా

పట్టణాల అభివృద్ధికి రూ.30కోట్లు ఇవ్వండి



మంత్రికి వివరిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్: పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాలను అభివృద్ధి చేసేందుకు రూ.30కోట్ల నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మంత్రి కేటీఆర్‌ను బుధవారం హైదరాబాద్‌లో కలిసి కోరారు. పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో రూ.25కోట్లు, సుల్తానాబాద్ పరిధిలో రూ.5కోట్ల వ్యయ అంచనాలతో చేపట్టే పనులకు నిధులు కేటాయించాలని కోరారు. ఇందుకు మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లెలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఈదునూరి సతీశ్(31) కుటుంబాన్ని సీతారామ సేవా సమితి సభ్యులు బుధవారం పరామర్శించి వారికి నిత్యావసర సరుకులు అందజేశారు. సమితి నిర్వాహకురాలు గోలివాడ చంద్రకళ మాట్లాడుతూ కుటుంబాన్ని ఆదుకోవడానికి కార్తీక్, కమల, భవాని గ్రూపు సభ్యులు అదనంగా సాయం చేయడానికి ముందుకు రావడం హర్షణీయమన్నారు. గ్రూపు సభ్యులు సరిత, లక్ష్మి, శైలజ, సౌజన్య, భవాని పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

జూలపల్లి: మండలంలోని ఎరువులు, విత్తనాలు, రసాయన మందులు అమ్మే దుకాణదారులు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి ప్రత్యూష తెలిపారు. మండల కేంద్రంలోని విత్తన, ఎరువుల దుకాణాలను బుధవారం ఎస్సై వెంకటకృష్ణతో కలిసి తనిఖీ చేశారు. స్టేషన్ రైటర్ శ్రీనివాస్ ఉన్నారు.

ఇంటింటా బీజేపీ ప్రచారం



ఇంటికి స్టిక్కర్ వేస్తున్న నాయకులు

రామగుండం: బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపును పురస్కరించుకొని సంపర్క్ అభియాన్‌లో భాగంగా బుధవారం అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి, మొగల్‌పహాడ్, పెద్దంపేట గ్రామాల్లో పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు మాడ నారాయణరెడ్డి, బండిపెల్లి చంద్రయ్య, బండి మహేశ్‌గౌడ్, నాయకులు బొడ్డు అనిల్, ఎనగంటి సదయ్య, సంతోష్, వెంకటేశం, పొన్నం సాగర్, నరేశ్, శ్రీనివాస్, పెండ్యాల సాగర్, కుమార్, రవి పాల్గొన్నారు.

మోదీ పాలనను ప్రజలకు వివరించాలి

పెద్దపల్లిరూరల్: పీఎం మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం మేరా బూత్ సబ్‌సే మజ్బూత్ కార్యక్రమం నిర్వహించారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిలారపు పర్వతాలు, పార్లమెంట్ కన్వీనర్ మల్లికార్జున్, అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, నాయకులు రాజేశ్వర్‌రావు, సంపత్‌రావు, దిలీప్, మహంతకృష్ణ, రాజన్న, నాగరాజు, వెంకటరమణ, మేకల శ్రీనివాస్, సంపత్, శ్రీకాంత్, సతీశ్, తిరుపతి, ప్రభాకర్, రవితేజ పాల్గొన్నారు.

వీడ్కోలు సమావేశం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని సాయిరాం గార్డెన్లో బుధవారం శ్రీవాణి డిగ్రీ కళాశాల విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి అందించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కళాశాలల కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక, డైరెక్టర్ రేకులపల్లి సుష్మ, ప్రిన్సిపాల్ బండారి కమలాకర్, బాలసాని శ్రీనివాస్, అడిచర్ల శ్రీనివాస్ ఉన్నారు.

పంచాయతీలకు పక్కా భవనాలు

- మండలంలో 12 గ్రామాలకు నిధులు మంజూరు
- ఉపాధిహామీ పథకం కింద ఒక్కో భవనానికి రూ.20లక్షలు



తాత్కాలిక భవనంలో కొనసాగుతున్న గ్రామపంచాయతీ

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాల్లో సరైన గ్రామపంచాయతీ కార్యాలయాలు లేక పాలన కొనసాగించడంలో, సేవలు అందించడంలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. కొన్నిచోట్ల అద్దె భవనాల్లో, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన గదుల్లో పంచాయతీ కార్యాలయం నిర్వహిస్తున్నారు. దీంతో సర్పంచ్‌లు పక్కా భవనాలు కావాలని ప్రభుత్వానికి అనేకసార్లు విన్నవించారు. ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద గ్రామపంచాయతీ భవనాలు నిర్మించాలని, దానికి ఒక్కో భవనం కోసం రూ.20లక్షలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సుల్తానాబాద్ మండలంలోని 27 గ్రామాలకు గాను 12 గ్రామాల్లో పక్కా భవనాల కోసం నిధులు మంజూరు చేశారు.

ఒక్కో భవనానికి రూ.20లక్షలు..

సుల్తానాబాద్ మండలంలోని 12 గ్రామాలకు నూతన గ్రామపంచాయతీ భవనాలు నిర్మించేందుకు ఒక్కో భవనానికి రూ.20లక్షల నిధులు కేటాయించారు. నిధులు కేటాయించిన గ్రామాల్లో అల్లీపూర్, భూపతిపూర్, చిన్నబొంకూర్, దుబ్బపల్లి, గర్రెపల్లి, కందునూరిపల్లె, కాట్నపల్లి, రేగడిమద్దికుంట, సుద్దాల, దేవునిపల్లి, నారాయణరావుపల్లి, రామునిపల్లి ఉన్నాయి. దీంతో నూతన భవనాలు పూర్తయితే గ్రామస్తులకు అన్నిరకాల సేవలు అందుబాటులో ఉంటాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పూర్తి సేవలు అందేలా..



గ్రామాల్లో పూర్తిస్థాయిలో సేవలు అందించేందుకు ఉపాధిహామీ ద్వారా మంజూరైన నిధులతో విశాలంగా ఉండేలా భవనాలు నిర్మించుకోవాలి. ఎంపికైన గ్రామాల్లో పనులు త్వరగా పూర్తి చేయడంతో పాటు నాణ్యతగా నిర్మించుకోవాలి. – శశికళ, ఎంపీడీవో, సుల్తానాబాద్

త్వరలోనే పనులు ప్రారంభం

మండలంలో 12 గ్రామపంచాయతీలకు పక్కా భవనం కోసం నిధులు మంజూరయ్యాయి. ఈ పనులు త్వరలోనే ప్రారంభించడం జరుగుతుంది. ఇప్పటికే కందునూరిపల్లెలో భవనం బేస్‌మెట్ వరకు పూర్తయ్యింది. మిగతా భవనాల పనులు కూడా ప్రారంభిస్తాం. – సతీశ్, పంచాయతీరాజ్ ఏఈ

గీత కార్మికులను రూ.లక్ష రుణం జాబితాలో చేర్చాలి



గీత కార్మికులతో సదయ్యగౌడ్

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తిదారులకు అందిస్తున్న రూ.లక్ష రుణం జాబితాలో గీత కార్మికులను చేర్చకపోతే జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని ఏగోలపు కుమార్‌గౌడ్ ట్రస్ట్ చైర్మన్, గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు ఏగోలపు సదయ్యగౌడ్, మోకుదెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు అంజిగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని శాస్త్రినగర్ నుంచి తహసీల్దార్ వరకు బుధవారం ర్యాలీగా వచ్చి తహసీల్దార్ యాకన్నకు వినతిపత్రం అందించారు. సుల్తానాబాద్ మాజీ సర్పంచ్ అన్నయ్యగౌడ్, జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, గౌడ సంఘం మండలాధ్యక్షుడు బండారి లక్ష్మణ్ గౌడ్, మోకుదెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పల్లెర్ల శారదాగౌడ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రమశిక్షణ కమిటీ చైర్మన్ వెంగాలి రాజగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మల్యాల రవిగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీనివాస్‌గౌడ్, యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు అమరగాని ప్రదీప్‌గౌడ్ పాల్గొన్నారు.

పీవీ ఆశయాల సాధనకు పని చేయాలి



సుల్తానాబాద్: కేక్ కట్ చేస్తున్న దామోదర్‌రావు



మంథని: నివాళి అర్పిస్తున్న చైర్‌పర్సన్ శైలజ



కమాన్‌పూర్: నివాళి అర్పిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు ఆశయ సాధనకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పనిచేయాలని బ్లాక్ కాంగ్రెస్ చైర్మన్ దామోదర్‌రావు అన్నారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలో బుధవారం పీవీ జయంతి సందర్భంగా కేక్ కట్ చేశారు.

మంథని: మంథనిలోని పీవీ నరసింహారావు విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, వైస్‌చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎంపీపీ కొండ శంకర్, పార్టీ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు పీవీ చిత్రపటానికి నివాళి అర్పించారు.

కమాన్‌పూర్: మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు జయంతి మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

రామగిరి మండలంలో..

సెంటినరీకాలనీలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో పీవీ నరసింహారావు జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

డబుల్‌రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలి

జూలపల్లి: బీఆర్‌ఎస్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు, మండలానికి చెందిన నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల మనోహర్‌రెడ్డి హైదరాబాద్‌లో ఐటీ శాఖ మంత్రి కేటీ రామారావును బుధవారం కలిశారు. నియోజక వర్గ సమస్యలను వివరించి నిధులు కేటాయించాలని కోరారు. పెద్దపల్లి, జూలపల్లి డబుల్‌రోడ్డు, హుస్సేన్‌మియా వాగుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. సమస్యలు విన్న మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన చెప్పారు.

సంక్షిప్త వార్తలు

✦ గ్రూప్–4 అభ్యర్థులకు బస్సు సౌకర్యం

గోదావరిఖనిటౌన్: జూలై 1న నిర్వహించే గ్రూప్–4 పరీక్షలకు పట్టణ, పరిసర ప్రాంతాల పరీక్షా కేంద్రాలకు గోదావరిఖని ఆర్టీసీ డిపో నుంచి అదనపు బస్సులు నడపనున్నట్లు స్థానిక డిపో మేనేజర్ పి.మల్లేషం తెలిపారు.

✦ అవార్డు గ్రహీతకు ఆత్మీయ సన్మానం

కాల్వశ్రీరాంపూర్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉత్తమ గెజిటెడ్ ఉపాధ్యాయుడిగా, ఉత్తమ ఎంఈవోగా అవార్డు పొందిన ఆరెపెల్లి రాజయ్యను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి బుధవారం సన్మానించారు. ఎంపీడీవో రామ్మోహనాచారి, మాజీ జెడ్పీటీసీ సదయ్య పాల్గొన్నారు.

✦ కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కమాన్‌పూర్(రామగిరి): రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన వేము రజిత, జంగిలి స్రవంతి, ఈర్ల శిరీష, పాలేటి శ్రుతి, ఎరవెని నిఖిత, మెండె రాజమణికి ప్రభుత్వం నుంచి మంజూరైన కళ్యాణలక్ష్మి చెక్కులను బుధవారం సర్పంచ్ గంట పద్మ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గంట వెంకటరమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

✦ ప్రైవేట్ పాఠశాలలోని బుక్‌స్టాల్ సీజ్

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని ప్రాంతంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ విక్రయిస్తుండగా బుధవారం మండల విద్యాధికారి సీజ్ చేశారు. పీడీఎస్‌యూ నాయకుల ఫిర్యాదు మేరకు బుధవారం తనిఖీ చేశారు. సదరు పాఠశాలపై విచారణ చేపట్టాలని, లేకుంటే విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి ఆందోళన చేపడతామని పీడీఎస్‌యూ నాయకులు పేర్కొన్నారు.

✦ పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద బుధవారం ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర 8వ మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను పీవైఎల్ బుధవారం ఆవిష్కరించారు. జూలై 4, 5వ తేదీల్లో కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో జరిగే ఈ మహాసభలో యువత అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు కాశీపేట ధర్మేందర్, తిరుపతి, బాలకృష్ణ కోరారు.

✦ ప్రతిభ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూల్లో 8, 9, 10వ తరగతిలో 2022–23 విద్యా సంవత్సరంలో ప్రతిభ చాటిన విద్యార్థులకు 1976–77లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో బుధవారం నగదు ప్రోత్సాహం అందించారు. 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జె.సాయికుమార్, ఎండీ సమీర, 9వ తరగతిలో డి.అక్షిత, ఎ.రిషిత, 8వ తరగతిలో ఎం.జశ్వంత్, ఎస్.శివకుమార్‌కు ఎంఈవో ఆరెపల్లి రాజయ్య నగదు ప్రోత్సాహం అందించారు. వెంకట్ ఫౌండేషన్ కరీంనగర్ వారు నోట్‌బుక్స్ అందజేశారు.

✦ తహసీల్దార్‌కు సన్మానం

పాలకుర్తి: పాలకుర్తి మండల తహసీల్దార్‌గా పనిచేసిన జె.సునీత ప్రస్తుతం బదిలీపై కలెక్టరేట్ పరిపాలనా విభాగానికి వెళుతున్న సందర్భంగా బుధవారం కాంగ్రెస్ నాయకులు తలారీ శంకర్ ఆధ్వర్యంలో సన్మానించారు. కేశోరాం సిమెంట్ కర్మాగారం కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కాల్వ అంజయ్యయాదవ్, మాదాసు సందీప్, సూర అంజికుమార్, దాడి పోషమల్లు, రాజేశం పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.19.80కోట్లు



మంత్రి ప్రశాంత్‌రెడ్డితో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

జూలపల్లి: మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రం వరకు 25 కిలోమీటర్ల రోడ్డుకు మోక్షం లభించింది. సీఎం కేసీఆర్ జూలపల్లి–పెద్దపల్లి డబుల్ రోడ్డుకు రూ.19.80 కోట్లు మంజూరు చేశారని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు. 'డబుల్ రోడ్డు కోసం ఎదురుచూపులు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే స్పందించి రోడ్డు మంజూరుకు రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని కలిసి విన్నవించారు. నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

రోడ్డు నిర్మించాలని డీవైఎఫ్ఐ నిరసన



నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

కోల్‌సిటీ: గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌లోని కిరాణం హోల్‌సేల్ మార్కెట్ ప్రధాన రహదారిపై రోడ్డు నిర్మించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కొంటు సాగర్, ఈస్ట్ ఏరియా కమిటీ కోకన్వీనర్ మొగిలిచర్ల సురేశ్ బుధవారం నిరసన తెలిపారు. కళ్యాణ్‌నగర్ రోడ్డు గుంతలతో పూర్తి అధ్వానంగా మారిందని, 42వ డివిజన్‌లో డ్రైనేజీ పనులను పూర్తి చేసి నెలలు గడుస్తున్నా, ఇప్పటికీ రోడ్డు నిర్మాణం చేపట్టకుండా నిర్లక్ష్యంగా వదిలేశారని ఆరోపించారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యం

పెద్దపల్లిరూరల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి పార్లమెంట్ పరిధిలో రెండు స్థానాలను బీసీలకు కేటాయించాలని బుధవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో తీర్మానించినట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొమురయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేశ్‌గౌడ్ తెలిపారు. ఓబీసీలకు తగినన్ని సీట్లు కేటాయిస్తామని ఢిల్లీ సమావేశంలో ప్రకటించిన పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీకి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా మడేలయ్య ఉత్సవాలు

ఓదెల: మండలంలోని కొలనూర్ గ్రామంలో రజకుల ఆరాధ్య దైవం మడేలయ్య ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. కులసంఘం పెద్దలు, నాయకులు, రజకులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ అందజేత

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్ల జెడ్పీ హైస్కూల్లో బుధవారం కరీంనగర్‌కు చెందిన వెంకట్ ఫౌండేషన్ సభ్యులు విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ అందజేశారు. ఫౌండేషన్ సభ్యుడు తూం కృష్ణకుమార్, ఎంపీటీసీ రావి సదానందం ఉన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి బోనాలు



బోనాలతో మహిళలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేటలో బుధవారం పెద్దమ్మతల్లి బోనాల కార్యక్రమం వైభవంగా జరిగింది. ముదిరాజ్ మహిళలు బోనాలతో పెద్దమ్మతల్లి ఆలయం వరకు వెళ్లి మొక్కులు సమర్పించుకున్నారు. సర్పంచ్ చీకటి స్వరూప, పోచాలు అమ్మవారికి మొక్కులు, నైవేద్యం సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, నాయకులు మందల సత్యనారాయణరెడ్డి, ఆరె తిరుపతి, రాజిరెడ్డి, నల్ల మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్: పట్టణంలోని పూసాల, శ్రీరాములపల్లిలో వైభవంగా పోచమ్మ, పెద్దమ్మ తల్లి బోనాలు వైభవంగా నిర్వహించారు. ముద్దిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లికి బుధవారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మొక్కులు చెల్లించారు. ఎంపీపీ బాలాజీరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీలు గుర్రాల మల్లేశం, లావణ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, నాయకులు రవి, గణేశ్, కిరణ్, ఆశాలు, శేఖర్, రమేశ్‌గౌడ్ ఉన్నారు.

మత్తడిని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి



మత్తడిని పరిశీలిస్తున్న విజయరమణారావు

ఓదెల: మండలంలోని శానగొండ ఊర చెరువు మత్తడి ధ్వంసంతో సుమారు 1200 ఎకరాల ఆయకట్టు బీడుగా మారే ప్రమాదముందని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మత్తడిని ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన రైతులతో కలిసి మత్తడిని పరిశీలించారు. మత్తడి ధ్వంసంతో నీరంతా వృథాగా పోతోందని, ఆయకట్టుకు నీరు చేరక పంటలు పండే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఎస్సారెస్పీ డీఈఈతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, సర్పంచు అంకం రమేశ్, ఎంపీటీసీ రాగిడి రవీందర్‌రెడ్డి, నాయకులు కోదాడి మనోహర్‌రావు, రెడ్డి రజనీకాంత్, నీర్ల శ్రీనివాస్, కోదాడి సంపత్‌రావు, బొంగోని శ్రీనివాస్‌గౌడ్, గాతిరెడ్డి సమ్మిరెడ్డి, అశోక్, భాస్కర్ రెడ్డి, వంగ ఆనంద్ పాల్గొన్నారు.

ఆలయ భూములను ఆక్రమిస్తున్నారు



మాట్లాడుతున్న భూపాల్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని ధర్మబాద గ్రామంలోని శ్రీరంగనాయకస్వామి ఆలయ భూములు ఆక్రమణకు గురయ్యాయని రాష్ట్రీయ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మండల భూపాల్ విమర్శించారు. శ్రీరంగనాయక స్వామి దేవాలయ భూములను రాష్ట్ర దేవాలయాల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు చీకటి రాజుతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రభుత్వాధికారుల అండదండలతో ఆలయ భూములను తన పేరిట పట్టా చేయించుకున్నాడని ఆరోపించారు.

గోహత్యల బాధ్యత ప్రభుత్వానిదే..

హిందువుల ఆరాధ్య దైవమైన గోవులను వధించడం చట్టరీత్యా నేరమని, రాష్ట్రంలో జరుగుతున్న గోహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని గోరక్షక్ జాతీయ అధ్యక్షుడు గిరిదారిలాల్ డిమాండ్ చేశారు. బక్రీద్ సందర్భంగా గోవులను వధించకుడా చూసే బాధ్యతను గోరక్షకులు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా గోరక్షక్ అధ్యక్షుడు జాపతి రాజేశ్, నాయకులు కొడాలి రాజు, చందు, యుగేందర్, డాక్టర్ నూతన్, చల్లా వడియార్, ఖండేశ్వర్ తులసిరాం, వేల్పుల రమేశ్ పాల్గొనారు.

లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తరించాలి



సమావేశంలో లయన్స్ క్లబ్ సభ్యులు

జ్యోతినగర్: గోదావరిఖని లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తరించాలని లయన్స్ క్లబ్ గోదావరిఖని స్ఫూర్తి అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రావు, రెండో డిస్ట్రిక్ట్ గవర్నర్ కోదండరాములు, మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ సీనియర్ లయన్ డాక్టర్ వెంకటేశ్వరరావు సూచించారు. ఎన్టీపీసీ రామగుండం సింధూర కళాశాల రోడ్డులోని ఫంక్షన్ హాలులో బుధవారం జరిగిన స్ఫూర్తి 12వ ఇన్‌స్టాలేషన్ సమావేశంలో వారు హాజరై మాట్లాడారు. పేద ప్రజలకు అండగా ఉంటూ సాధ్యమైనంత వరకు సేవ చేయాలన్నారు. అనంతరం ఎన్నికైన అధ్యక్షుడు నూతన కార్యవర్గం గోపాలరావు, కార్యదర్శి రవికుమార్, కోశాధికారి కిరణ్ కుమార్, జాయింట్ సెక్రెటరీ బుల్లి రవికుమార్‌తో డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ కోదండరాములు ప్రమాణం చేయించారు. రీజియన్ చైర్మన్ వి.అశోక్, జోనల్ చైర్మన్ సోమారపు లావణ్య, డీసీఎస్ రమణారెడ్డి, సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోండి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: ప్రైవేయిట్, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 25శాతం పేదలకు ఉచిత విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ కన్స్యూమర్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగు శ్రీనివాస్ బుధవారం కలెక్టర్, డీఈవో మాధవికి వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నోటీస్ బోర్డులపై ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టికలను పెట్టడం లేదని ఆరోపించారు. జిల్లా కార్యదర్శులు నీలవతి, గాండ్ల స్వరూప, రామగుండం అధ్యక్షుడు కాంపెల్లి వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి టాటా శ్రీనివాస్, భరత్ పాల్గొన్నారు.

బహుజన రాజ్యంలో పేదలకు పక్కా ఇళ్లు



మాట్లాడుతున్న దాసరి ఉష

జూలపల్లి: బహుజన రాజ్యంలో నిరుపేదలకు రెండేళ్లలోనే పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఉన్నారు. మన ఊరు–మన ఉష కార్యక్రమంలో బుధవారం మండలంలోని పెద్దాపూర్, కోనరావుపేటలో హనుమాన్ ఆలయంలో పూజలు చేసి గ్రామంలో గడపగడపకూ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దాసరి హన్మయ్య, అసెంబ్లీ కోశాధికారి రియాజ్, పెద్దపల్లి పట్టణ కార్యదర్శి అజీమ్, మహిళా కన్వీనర్ అరుణ, కో కన్వీనర్ అఖిల, మండల అధ్యక్షుడు సీపెల్లి కొమురయ్య, కాల్వశ్రీరాంపూర్ మండల అధ్యక్షుడు కుమ్మరికుంట రవికుమార్, కోశాధికారి మల్లారపు మల్లేశం, అల్లపు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ స్పెషల్‌డ్రైవ్

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో బుధవారం పోలీసులు వాహన తనిఖీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సీఐ అనిల్, ఎస్సై మహేందర్‌తో పాటు సిబ్బంది వాహన తనిఖీల్లో భాగంగా నెంబర్ ప్లేట్‌లేని, నెంబర్ ప్లేట్ టాంపరింగ్ చేసి నడుపుతున్న 40 వాహనాలను పట్టుకున్నారు. వాహనదారులకు జరిమానా విధించారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

గోదావరిఖని: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై రమేశ్ అన్నారు. కాకతీయనగర్ హనుమాన్ టెంపుల్ సమీపంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం ఆయన ప్రారంభించారు. పట్టణ ప్రజలు తమ వంతు బాధ్యతగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ జగదీష్

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పాటు అప్రమత్తంగా ఉండాలని సీఐ జగదీష్ కోరారు. సుల్తానాబాద్ మండలం రామునిపల్లి గ్రామంలో బుధవారం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్రాలు లేని 30 బైకులు, ఒక ఆటో, ట్రాలీలను సీజ్ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. ఎస్సైలు విజేందర్, వెంకటకృష్ణ, వినీత, శ్రీనివాస్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.